ఉపాధి కూలీలకు వసతులు కరువు

పెరిగిన ఎండలు

- కనిపించని టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు
- ఇంటి నుంచి తెచ్చుకుంటేనే తాగునీరు
- పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని కూలీల విజ్ఞప్తి


ఎండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

దుత్తలూరు: వేసవి ప్రారంభమవక ముందే ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తల్లడిల్లిపోతున్నారు. వేసవిలో పనిప్రదేశాల్లో ఉపాధి కూలీలకు అవసరమైన వసతులు కల్పించాలి. కానీ ఉపాధి అధికారులు, సిబ్బంది వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

కనిపించని టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు

గతంలో ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు అందజేసిన టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అడ్రస్ లేకుండా పోయాయి. వేసవిలో పని ప్రదేశంలో ఉపాధి కూలీలు సేదతీరేందుకు టెంట్లతో పాటు ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేసేది. అలాగే వడదెబ్బ నుంచి రక్షణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీటిని సైతం అందజేసేది. అలాగే వేసవిలో ఉపాధి కూలీలకు అదనంగా పది నుంచి ఇరవై శాతం వరకు అలవెన్సులు ఇచ్చేవారు. వీటితో పాటు గడ్డపారలు, చెలగపారలు వంటివి అందజేసి కూలీలను ప్రోత్సహించేది. ప్రస్తుతం కూలీలకు ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో కొన్నిచోట్ల ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు వెనుకాడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఉపాధి పనుల వద్ద టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

రూ.25కోట్ల మేర వేతన బకాయిలు

జిల్లాలోని 38 మండలాలలో 722 పంచాయతీలు ఉన్నాయి. 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 4.48 లక్షల మంది కూలీలుగా నమోదై ఉన్నారు. గత ఆరు వారాలుగా జిల్లాలో రూ.25 కోట్ల మేర వేతన బకాయిలు ఉన్నాయి. కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో వారి జీవనం సాగడం కష్టంగా మారింది. ఉపాధి కూలీలకు గిట్టుబాటు కూలి కల్పించడంలో కూడా అధికారులు విఫలమవుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనిచేసినా కూలి గిట్టుబాటు కావడం లేదు. కూలి గిట్టుబాటు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు అన్ని రకాల వసతులు కల్పించాలి. గిట్టుబాటు కూలి దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వేసవిలో పని దినాలు పెంచి అలవెన్సులు అందించాలి.

– గుజ్జుల మల్లికార్జున, సీపీఎం మండల కార్యదర్శి

అలవెన్సులను తీసేశారు

ఉపాధి హామీ పథకం సాఫ్ట్‌వేర్ మారింది. ప్రస్తుతం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే పథకం నడుస్తోంది. దీంతో గతంలో సరఫరా చేసే ప్రథమ చికిత్స కిట్లు, పారలు, గడ్డపారలు ఆగిపోయాయి. స్థానిక వైద్యశాలల్లో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సేకరించి పనుల వద్ద ఉంచాలని సిబ్బందికి తెలియజేశాం. కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉదయం, సాయంత్రం పనులను చేయించేలా ఆదేశాలిస్తాం.

–శంకరనారాయణ,ఏపీడీ,ఉదయగిరి

క్లుప్తంగా

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

ఆత్మకూరు: ఆల్ ఇండియా ఇన్సూ్యరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు ఆత్మకూరు ఎల్ఐసీ బ్రాంచ్ ఎదుట ఉద్యోగులు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. 3, 4వ తరగతి ఉద్యోగుల నియామకాలను చేపట్టాలని, ఎల్ఐసీ ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కంటి అద్దాల అందజేత

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో కంటి సమస్యలతో బాధపడుతున్న 60 మంది విద్యార్థినులకు కంటి వైద్యుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కంటి అద్దాలను గురువారం అందజేశారు. ప్రిన్సిపల్ కామేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

అల్లూరు/జలదంకి/సీతారామపురం: అల్లూరు నగర పంచాయతీ, జలదంకి, సీతారామపురం మండల పరిషత్ కార్యాలయాల్లో కార్పొరేషన్ సబ్సిడీ రుణ దరఖాస్తుదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, జలదంకి, సీతారామపురం ఎంపీడీఓలు బ్రహ్మయ్య, భాస్కర్ గురువారం తెలిపారు. ఇంటర్వ్యూలకు వచ్చే వారు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని కోరారు.

చెత్తబుట్టల పంపిణీ

ఉదయగిరి: శకునాలపల్లెలోని ఇంటింటికి ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కరీముల్లా, సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి గురువారం చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని మహిళలకు సూచించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వరికుంటపాడు: తూర్పుబోయమడుగుల రోడ్డులో గురువారం జరిగిన ప్రమాదంలో తూర్పుచెన్నంపల్లె బ్రాంచ్ పోస్టాఫీసులో అసిస్టెంట్ బీపీఎంగా పనిచేస్తున్న జమ్మలమడుగు మహాలక్ష్మయ్య తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మహాలక్ష్మయ్య ఉదయం విధి నిర్వహణలో భాగంగా వరికుంటపాడు సబ్‌పోస్టాఫీస్‌కు వెళ్లి తపాలా బ్యాగు తీసుకుని తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నెల్లూరుకు తరలించారు.

పోలేరమ్మ చీరల వేలం

అల్లూరు: అల్లూరుపేటలోని పోలేరమ్మకు భక్తులు సమర్పించిన చీరలను గురువారం వేలం వేయగా రూ.65,850 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ చిట్టిబాబు తెలిపారు.

కెనరా బ్యాంకు సేవలపై అవగాహన

సంగం: మండల కేంద్రమైన సంగంలోని ఇంటింటికి వెళ్లి కెనరా బ్యాంక్ సేవలపై ఆ బ్యాంకు అధికారులు గురువారం అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ శివ మహిళల కోసం ప్రత్యేకంగా ఏంజెల్ ఖాతాలో రూ.5వేలు మినిమం బ్యాలెన్స్ ఉంచితే కేన్సర్ కేర్, బీమా సౌకర్యాలను కల్పిస్తున్నామని వివరించారు.

ఘనంగా గిరిజన భాషా దినోత్సవం

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గిరిజన భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులు గిరిజనుల వేషధారణలతో అలరించారు. ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్ , మహేష్, వెంకటేశ్వర్లు, రమణరాజు, కృష్ణారెడ్డి, మాధవి, పెద్దయ్య పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

ఉదయగిరి: ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే ఆటోవాలాలపై కఠిన చర్యలు తప్పవని కావలి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కే కరుణాకరన్, బీ లక్ష్మీబాయి హెచ్చరించారు. ఉదయగిరి ప్రాంతంలోని వివిధ మార్గాల్లో తిరిగే ఆటోవాలాలు అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు ప్రయాణీకుల నుంచి ఫిర్యాదులు అందడంతో గురువారం వారు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిమితికి మించి ప్రయాణీకులను తరలిస్తున్న పది ఆటోలు, లైసెన్సులు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని, ట్యాక్స్‌లు చెల్లించని మరో పది ఇతర వాహనాలను పట్టుకుని జరిమానా విధించారు.

వ్యక్తి ఆత్మహత్య

కావలి: పట్టణంలోని మద్దూరుపాడుకు చెందిన కొమ్మా శ్రీనివాసులు (41) తన ఇంట్లో పురుగు మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరోగ్యం బాగా లేకపోవడం, ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కే బాలకృష్ణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీడీసీ సర్వే పరిశీలన

ఉదయగిరి: ఉదయగిరిలోని కంసలివీధి, వీరారెడ్డిపల్లిలోని ఎస్సీ కాలనీలో అసంక్రమిత వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది చేపడుతున్న సర్వేను గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య విద్యా బోధకుడు కలసపాటి వెంకటసుబ్బయ్య గురువారం పరిశీలించారు. మహిళల్లో ప్రధానంగా వచ్చే రొమ్ము, గర్భాశయ, అండాశయ, నోటి కేన్సర్లపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు సుప్రజ, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి ఆంజనేయనాయక్ తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలో ధాన్యం కొనుగో లు కేంద్రాలను తెరిచినా రైతుల నుంచి ధాన్యం సేకరించకపోవడంపై 'సాక్షి'లో 'గింజ కొంటే ఒట్టు' శీర్షికన గురువారం ప్రచురితమైన కథనంపై ఏఓ స్పందించారు. గుడినరవలోని కొనుగోలు కేంద్రంలో రైతులతో సమావేశమయ్యా రు. మండలంలో వరి కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదన్నారు. వరికోతలు ప్రారంభమైన వెంటనే ధాన్యాన్ని సేకరిస్తామని తెలిపారు. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్ముకుని నష్టపోకుండా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం


బండారుపల్లికి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు చేస్తున్న అకృత్యాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి భరోసానిచ్చారు. ఇటీవల బండారుపల్లిలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పగుంట కృష్ణయ్య, కోనేపల్లి సుధాకర్‌రెడ్డి, తదితరుల కుటుంబాలను గురువారం ఆయన పరామర్శించారు. ఘర్షణలకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకుని చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలను నాయకులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి కార్యకర్తకు అండగా నిలిచేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో టీడీపీ కారణంగా బాధపడిన ప్రతి కార్యకర్త తగిన సమాధానం చెప్పేలా పనిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కరటంపాడులో ఇటీవల మృతి చెందిన ఎంపీటీసీ సభ్యుడు ఖాసీం, వలంటీర్ షేక్ ఖాజారసూల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, జిల్లా డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు జాగర్లమూడి ప్రణీత్‌చౌదరి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వల్లభనేని రాజేంద్ర, తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన పలువురిని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆత్మకూరు మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ తండ్రి నారాయణరెడ్డి, మర్రిపాడు మండలానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి వెంకటేశ్వర్లు నెల్లూరులోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నెల్లూరులో నివాసం ఉంటున్న సంగం మాజీ జెడ్పీటీసీ ఇందూధర్‌రెడ్డి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

సోమశిల: అనంతసాగరం మండలం బొమ్మవరం అగ్రహారంలో నూతనంగా నిర్మించిన రామమందిరం, అభయాంజనేయస్వామి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దర్శించారు. అనంతరం రేవూరు ఉపసర్పంచ్ పాలపాటి నాగార్జునరెడ్డి, నివేదిత దంపతుల కుమారుడు రాహుల్‌రెడ్డి వివాహ వేడుకకు హాజరై వరుడిని ఆశీర్వదించారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, బుజ్జమ్మ, ఎంపీటీసీ అక్కలరెడ్డి కొండారెడ్డి , తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, యువత విభాగం నాయకుడు నాగా సుబ్రహ్మణ్యంరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎంజీఆర్ షటిల్ పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. విజేతగా ఉదయ్, రవితేజ జట్టు , రన్నర్‌గా అశోక్, శివ జట్టు నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.10,116, ద్వితీయ బహుమతి రూ.7,116 నగదుతో పాటు షీల్డులను మేకపాటి విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

తిరుగుబాటు మొదలైంది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలే అయినా ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, తొలుత రైతుల్లోనే ఆ అసంతృప్తి కనిపిస్తోందని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హామీల గురించి ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపిస్తున్నారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే గుంటూరు మిర్చి యార్డు వద్ద పోలీస్ రక్షణ కల్పించలేని ప్రభుత్వం సామాన్యులకు ఏమి కల్పిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతూ జగన్‌పై కేసులు నమోదు చేశారని, ఇదే కోడ్ కూటమి నాయకులకు, మంత్రులకు వర్తించదా అని ఆయన అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు జే ప్రణీత్, నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, న్యాయవాది నందా ఓబులేసు, వినయ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

సంగం: జిల్లాలోని అన్ని మండలాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. సంగంలోని పొదుపు కార్యాలయంలో ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో 12 అభివృద్ధి పనులను చేపట్టేందుకు జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.50.60లక్షలను మంజూరు చేశామని తెలిపారు. అలాగే జిల్లా పరిషత్ జనరల్ ఫండ్స్ నుంచి రూ.29లక్షలను 8 పనుల కోసం మంజూరు చేశామని చెప్పా రు. మండలాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందజేస్తామని తెలిపారు. జెడ్పీటీసీ రావుల లక్ష్మి, ఎంపీడీఓ షాలెట్,డీటీ సంధ్య, ప్రజాప్రతినిధులు, మండలాధికారులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

సంగం : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చెన్నైలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు..ఈ నెల 17న ఆత్మకూరుకు చెందిన షేక్ మున్నా (27) నెల్లూరు వెళ్లి రాత్రి 10.30 గంటల సమయంలో తిరిగి వస్తుండగా సంగం వద్ద బైక్ అదుపుతప్పడంతో తలకు తీవ్రగాయమైంది. చెన్నైకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి

జలదంకి: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ పథకానికి నిధులను పెంచాలని సీపీఎం జిల్లా నాయకుడు తాళ్లూరి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద వామపక్ష నాయకులు గురువారం ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు.

ఇంటర్వ్యూలు

ఆత్మకూరు/వరికుంటపాడు: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణ దరఖాస్తుదారులకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సీ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 355 మంది దరఖాస్తు చేసుకోగా, 280 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అలాగే వరికుంటపాడు మండలంలో 260 మంది దరఖాస్తు చేసుకోగా 138 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

వింజమూరు(ఉదయగిరి): పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని కావలి డీఎల్‌పీఓ మాధవీలత సూచించారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ గోపిశ్రీనివాస్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. మార్చి నెలాఖరులోగా ఇంటి పన్నులను నూరు శాతం వసూలు చేయాలన్నారు. వింజమూరులో పారిశుధ్యాన్ని మెరుగుపరిచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

డీఈఓ తనిఖీలు

మర్రిపాడు/సోమశిల: పదోతరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజా బాలాజీరావు అన్నారు. నందవరం ఆదర్శ పాఠశాల, చిలకలమర్రి ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన వంద రోజుల కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సర్వేలను బాధ్యతగా చేపట్టాలి

ఉదయగిరి: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలోని సిబ్బంది పీ–4, నాన్‌రెసిడెన్సీ సర్వేలను సమన్వయంతో బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ అప్పాజీ సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయం నుంచి సచివాలయ సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వేల్లో వెనుకబడి ఉన్నామని, వేగవంతం చేసి లక్ష్యాన్ని అధిగమించాలన్నారు.

కానుక ఇవ్వాలని..చూపించి వస్తానని

రూ.1.50లక్షల బంగారంతో ఉడాయింపు

మర్రిపాడు: ఉపాధ్యాయినికి కానుకగా ఇవ్వాలని, చూపించి వస్తానని దుకాణదారురాలికి మాయమాటలు చెప్పి ఓ వ్యక్తి బంగారు ఆభరణాలతో ఉడాయించాడు. ఈ ఘటన డీసీపల్లిలో గురువారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..డీసీపల్లి బస్టాండ్ సెంటర్‌లో దీప్తి జ్యూవెలరీ పేరుతో బంగారు నగల దుకాణాన్ని వీ కొండారెడ్డి నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం ఆయన తన భార్యను దుకాణంలో ఉంచి బయటకు వెళ్లాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి దుకాణంలోకి వచ్చాడు. నందవరం పాఠశాలలో పనిచేస్తున్నానని, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయినికి బంగారం కానుకగా ఇవ్వాలని రూ.1.50లక్షల విలువైన చైను, బంగారు కమ్మలను ఎంపిక చేశాడు. వాటిని టీచర్‌కు చూపించి వస్తానని తీసుకుని వెళ్లి ఉడాయించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.